మనం
కడప | అన్నమయ్య

## పెనగలూరులో వీరులు.. విక్రమార్కుల సత్తా తేలేది అప్పుడే..!

వివరాలు 4లో









# ప్రతీ గడపకూ 'అమరజీవి జలధార'

**రూ.30,156 కోట్లతో రికార్డు ప్రాజెక్టుకు శ్రీకారం**
**48 వేల గ్రామాలు.. 3.27 కోట్ల మంది దాహార్తి తీర్చే బృహత్ కార్యం**
**గత పాలకుల నిర్లక్ష్యానికి పల్లెలు బలి.. కేంద్ర నిధులనూ వదిలేశారు: సీఎం చంద్రబాబు**
**రాజకీయాలకు తావులేదు.. పులివెందులకూ రూ.280 కోట్లతో తాగునీటి పథకం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

మనం ప్రతినిధి కడప అక్టోబర్ 5, రాష్ట్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన కుళాయి నీరందించి ప్రజారోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ -- 'అమరజీవి జలధార' పథకం కింద రూ.30,156 కోట్ల పనులకు వారు భూమిపూజ చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో పల్లెలు కన్నీళ్లు పెట్టాయని, కేంద్రం ఇచ్చిన నిధులను సైతం సద్వినియోగం చేసుకోకుండా ప్రజల దాహార్తిని గాలికొదిలేశారని నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**గత ప్రభుత్వ వైఫల్యానికి పల్లెలు బలయ్యాయి: సీఎం చంద్రబాబు**

సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గ్రామాలు సర్వనాశనమయ్యాయని మండిపడ్డారు. పల్లెల్లో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు లేక ప్రజలు నరకం చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా యూపీ రూ.1 లక్ష కోట్లు, మధ్యప్రదేశ్ రూ.83 వేల కోట్లు రాబట్టుకుంటే.. గత 'గొడ్డలి పార్టీ' సర్కారు కేవలం రూ.2,600 కోట్లతో సరిపెట్టి ఏపీకి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని భుజానికెత్తుకుని వేగంగా పరుగులు పెట్టిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన అభినందించారు.



పల్లెలకు రహదారులు వేయడంలో పవన్ తనదైన ముద్ర చూపారని, ఒకేసారి 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారని సీఎం కొనియా డారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.4,136 కోట్లకు పైగా గ్రాంట్లను గ్రామాలకు అందించామని, రాబోయే ఐదేళ్లలో గ్రామీణాభివృద్ధి కోసం రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. 'ఎన్టీఆర్ భరోసా' ద్వారా రూ.76 వేల కోట్లను నేరుగా పేదల ఖాతాల్లో పెన్షన్లుగా జమ చేసి ఆదుకున్నామని వివరించారు. రెండేళ్లలో సాగునీటి కోసం రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, రాబోయే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు ప్రారంభిస్తామని తెలిపారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాదిలో కరవును శాశ్వతంగా తరిమికొడతామని ఆయన స్పష్టం చేశారు.



**పార్టీలు, ప్రాంతాలు చూడబోం - ప్రజలే ముఖ్యం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

?అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ, తాగునీటి సరఫరాలో రాజకీయాలకు తావులేదని, పార్టీలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి విధానమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైకాపా ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుకు రూ.280 కోట్లు కేటాయించి 299 గ్రామాల తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నామని ఆయన వెల్లడించారు. అలాగే తాళ్లమాపురం పంచాయతీకి రూ.3.5 కోట్ల అభివృద్ధి పనులను తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.



?'అమరజీవి జలధార' కింద రూ.30,156 కోట్లతో 50,315 పనులకు శ్రీకారం చుట్టామని, 3.27 కోట్ల మంది ప్రజలకు స్వచ్ఛమైన కుళాయి నీరు అందిస్తున్నామని చెప్పారు. గత పాలకులు నిధులు ఖర్చు చేయకపోవడంతో పథకం రద్దయ్యే ప్రమాదం ఏర్పడగా, సీఎం చంద్రబాబుతో కలిసి కేంద్రంతో సంప్రదింపులు జరిపి గడువును 2028 వరకు పొడిగించామని వివరించారు. ఏడు దశాబ్దాల్లో ఏర్పాటైన వసతులతో పోలిస్తే, ఈ ఐదేళ్లలోనే 50 నుంచి 175 శాతం అదనపు సామర్థ్యాన్ని సమకూరుస్తున్నామని తెలిపారు. నీటి నాణ్యత పర్యవేక్షణకు రూ.1,624 కోట్లు కేటాయించామని, రూ.123 కోట్లతో 892 ఫిల్టర్ బెడ్లను బాగు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాక నష్టపోయిన చిన్న కాంట్రాక్టర్లకు 'ఫిఫో' పద్ధతిలో సకాలంలో బిల్లులు చెల్లిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.



ఈ సభలో మంత్రులు పొంగూరు నారాయణ, ఎస్. సవిత, బీసీ జనార్ధనరెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కలెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ వద్ద రాజంపేట గళమెత్తిన యల్లటూరు

**నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధుల మంజూరుపై పట్టు**
**శ్రీనివాసరాజు చొరవపై జనసేనాని ప్రశంసలు**



మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 5: రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, స్థానిక ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో కీలక భేటీ నిర్వహించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో ఏర్పాటు చేసిన 'జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార' కార్యక్రమానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రిని కలిసిన శ్రీనివాసరాజు, రాజంపేట పరిధిలోని తాజా పరిస్థితులను ఆయన ముందుంచారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని తాగునీటి ఎద్దడి, సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల విస్తరణతో పాటు మౌలిక వసతుల కొరతపై యల్లటూరు సమగ్రంగా వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని గట్టిగా కోరారు. ప్రజా సమస్యలపై యల్లటూరు శ్రీనివాసరాజు కనబరుస్తున్న చిత్తశుద్ధి, నిరంతర చొరవను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరపున అత్యధిక ప్రాధాన్యతనిచ్చి వేగవంతమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధినేత వద్ద రాజంపేట గళాన్ని సమర్థవంతంగా వినిపించిన యల్లటూరు శ్రీనివాసరాజు నాయకత్వంపై నియోజకవర్గ జనసేన శ్రేణుల్లో, కూటమి నాయకుల్లో నూతనోత్సాహం నెలకొంది



## కూటమి పాలనలోనే 'రాయలసీమ రైజింగ్' సాకారం: చమర్తి జగన్ మోహన్ రాజు






మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 5 రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సమర్థవంతమైన పాలనతోనే 'రాయలసీమ రైజింగ్' సాధ్యమవుతోందని రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు స్పష్టం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించిన ప్రతిష్టాత్మక 'జల జీవన్ మిషన్ 2.0 - అమరజీవి జలధార' భారీ బహిరంగ సభలో చమర్తి జగన్ మోహన్ రాజు పాల్గొన్నారు. సభలో రాజంపేట ప్రతినిధిగా ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ, విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల సమష్టి నాయకత్వంలో రాయలసీమ మునుపెన్నడూ లేని రీతిలో ప్రగతిపథంలో దూసుకుపోతోందని కొనియాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే దశాబ్దాల తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికలు రచిస్తూ కార్యాచరణకు పూనుకుందని తెలిపారు.

**రాజంపేటకు వరం 'జల జీవన్ మిషన్ 2.0'**

'జల జీవన్ మిషన్ 2.0' పథకం ద్వారా రాజంపేట నియోజకవర్గానికి ఎనలేని ప్రయోజనం చేకూరనుందని జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పల్లెపల్లెనా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రోజుకు తలసరి 55 లీటర్ల శుద్ధ జలం ప్రతి గడపకూ చేరనుందని వివరించారు. దీనివల్ల నియోజకవర్గ ప్రజలను ఏళ్ల తరబడి వేధిస్తున్న భూగర్భ జలాల కొరత, ఫ్లోరైడ్ బారి నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి యజ్ఞంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలవాలని చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు.

## పీలేరులో ఘనంగా నిఖా వేడుక: వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ ప్రముఖులు







మనం ప్రతినిధి మదనపల్లి అక్టోబర్ 5: పీలేరు పట్టణంలోని నాగిరెడ్డి మెగా ఫంక్షన్ హాల్‌లో ఏపీ టీడీపీ యూత్ (కువైట్) అధ్యక్షుడు పటాన్ ఖాదర్ ఖాన్ సహోదరి వివాహ వేడుక (నిఖా) సోమవారం ఘనంగా జరిగింది. సుగవాసి యువసేన అధ్యక్షులు కంచన రెడ్డిశేఖర్ (టీడీపీ ఎన్ఆర్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శుభకార్యానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తిరుపతి టీడీపీ ఇన్‌ఛార్జ్ జేబీ శ్రీనివాస్, రాజంపేట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎద్దుల సాగర్, టీడీపీమాజీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు కంచన రెడ్డయ్య, మన్నేరు రామాంజులు, పఠాన్ దర్బార్, షాహీద్ పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన ప్రముఖులు నూతన వధూవరులను ఆత్మీయంగా ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లాహ్ ఆశీస్సులతో నూతన దంపతులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కలకాలం వర్ధిల్లాలని, వారి దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. వేడుకను ఘనంగా నిర్వహించిన పటాన్ ఖాదర్ ఖాన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు నాయకులు ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు.

## అటవీ శాఖ అధికారిగా ఎస్.శ్రీనివాసులు బాధ్యతలు



ముద్దనూరు, అక్టోబర్, 5, మనం న్యూస్: అడవుల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని ముద్దనూరు అటవీ శాఖ అధికారి (ఎఫ్ఆర్ఓ) ఎస్.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్నారు. సోమవార అటవీ శాఖ కార్యాలయ భవనంలో ఎఫ్ఆర్ఓగా బాధ్యతలు స్వీకరించారు. రైల్వే కోడూరు అటవీ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీపై ముద్దనూరు ఎఫ్ ఆర్ వో గా బాధ్యతలు చేపట్టినట్టు వివరించారు. అటవీ శాఖ పరిధిలో ని అటవీ సంపదను పరిరక్షించడానికి తన వంతు కృషి చేస్తానని అడవుల పరిరక్షణ కేవలం అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలు, చెట్ల నరికివేత లేదా అటవీ సంపదకు నష్టం కలిగించే చర్యలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో ముద్దనూరు రేంజ్‌లో అటవీ సంపదను మరింత సమర్థవంతంగా సంరక్షించేందుకు చర్యలు చేపడతానన్నారు.

## భూమికి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్‌కు వినతి



పెనగలూరు(అక్టోబర్ 05),మనం న్యూస్: తమ భూమిని పక్క భూమి వారు ఆక్రమిస్తున్నారని సర్వే చేసి హద్దు చూపించాలని తహశీల్దార్ సుమని కి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధితుడు గండికోట రమేష్ బాబు వినతి పత్రాన్ని ఇచ్చారు. నారాయణనెల్లూరు రెవెన్యూ విలేజ్ లోని సర్వే నెంబర్ 688-2 లో విస్తీర్ణం-1.65 ఎకరాలు భూమిని ప్రభుత్వం వారు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ భూమి నల్లపురెడ్డిపల్లి, నారాయణ నెల్లూరు రెవెన్యూ విలేజ్ లకు బార్డర్ లో ఉందని రీసర్వే లో హద్దులు ఏర్పాటు చేస్తామని గతంలో మండల సర్వేయర్ ఎండార్స్ మెంట్ ఇచ్చారని చెప్పారు. అధికారులు హద్దులు ఏర్పాటు చేయకుండానే ఈ భూమి తమ దేనని ఆక్రమిస్తున్నారని తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సుమని చెప్పారు.

## జూనియర్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు అనంతంపల్లి విద్యార్థులు ఎంపిక



పుల్లంపేట అక్టోబర్ 4 మనం న్యూస్ తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలంలోని అనంతంపల్లి ఉన్నత పాఠశాలలోని36 వ సబ్ జూనియర్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు అనంతపల్లి విద్యార్థులు ఎంపిక... ఈనెల 4న అన్నమయ్య జిల్లా రాయచోటి నందు 36వ సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్ నందు ఎంపిక నిర్వహిశీచారు. అందులో భాగంగా అనంతపల్లి ఉన్నత పాఠశాల చెందిన 1.వా. దీక్ష, 2.. లావణ్య, 3.=. ప్రవీణ్ అనే 10 వ తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. అందులో ఎంపికైన వారు ఈ నెల 10 నుండి 12 వరకు వెస్ట్ గోదావరి జిల్లా లోని నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి అన్నమయ్య జిల్లా తరపున ఆడుతారని పాఠశాల హెడ్మాస్టర్ పనీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ మయూరి గార్లు తెలిపారు..పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల హర్షం వ్యక్తం తెలిపారు.

## తోపు ఫోరంబోకు స్థలంలోని ఆక్రమణలు తొలగించాలి

– శింగనమల గ్రామ ప్రజలు వినతి –

పెనగలూరు(అక్టోబర్ 05), మనంన్యూస్: పెనగలూరు మండలం శింగనమల గ్రామంలో సర్వే నెంబర్ – 329/1 లో 1.10 ఎకరాల భూమి లో ఉండే ఆక్రమణ లను తొలగించాలని మాజీ జడ్పిటీసీ సభ్యుడు ఎర్రి నరసింహులు, గుండ్లూరు వెంకటేష్, గుండ్లూరు మల్లికార్జున, జనార్ధన్, శంకరయ్యలు తహసీల్దార్ సుమనికి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. సర్వే చేపించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి చెప్పారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండల విద్యార్థులు



ముద్దనూరు, అక్టోబర్, 5, మనం న్యూస్: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే హాకీ క్రీడలో అండర్ 17 విభాగంలో ఎస్ జుబేర్, అండర్ 14 విభాగంలో రవిచంద్ర, వి అహరిక క్రీడలలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు సోమవారం ప్రధానోపాధ్యాయులు ఓబులేష్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుని హరీఫ్ పర్యవేక్షణలో ఎంతో శ్రద్ధతో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో క్రీడలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా మెరిసి ముదునూరు మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఉపాధ్యాయులు కోరారు.

# పెనగలూరులో వీరులు.. విక్రమార్కుల సత్తా తేలేది అప్పుడే..!

**స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధం.. నేతల ప్రజాబలానికి అసలు పరీక్ష**

**లోకల్‌లో ఎవరి బలం ఎంతనేది ఫలితాలతోనే స్పష్టం**

**కూటమి నేతల సమన్వయం.. గెలుపు కోసం సమష్టి కృషి చేస్తారా?**




పెనగలూరు(అక్టోబర్ 05),మనం ప్రతినిధి: పెనగలూరు మండలంలో రాజకీయంగా ఆసక్తికరమైన సమీకరణాలు నెలకొంటున్నాయి. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, సర్పంచి స్థానిక సంస్థల ఎన్నికలు ఆయా పార్టీల నాయకుల ప్రజాబలానికి అసలు పరీక్షగా మారనున్నాయి. ఇప్పటి వరకు తమకే మండలంలో బలమైన పట్టు ఉందని చెప్పుకుంటున్న నాయకులు.. క్షేత్రస్థాయిలో ఎంత మేరకు ప్రభావం చూపగలరన్నది ఈ ఎన్నికల ఫలితాలతో తేలనుంది. స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో గ్రామస్థాయిలో అభ్యర్థుల ఎంపిక, వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు, కార్యకర్తల బలం కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా టీడీపీ, జనసేనతో కూడిన కూటమి పక్షాల్లో స్థానికంగా ఎవరి ప్రభావం ఎంత? ఎవరి వెంట కార్యకర్తలు, అనుచరులు ఎక్కువగా ఉన్నారు..? అన్నది ఈ ఎన్నికల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**కూటమి నేతలకు సమన్వయం సవాల్**

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు టీడీపీ, జనసేన నాయకులు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. స్థానికంగా నాయకుల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహం, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకురావడం వంటి అంశాలు పెనగలూరు మండలంలో కీలకంగా మారనున్నాయి. వ్యక్తిగత ఆధిపత్యానికి కాకుండా కూటమి విజయమే లక్ష్యంగా నేతలు పనిచేస్తారా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**మాటల బలం.. ఓట్ల బలంగా మారుతుందా?**

ఇప్పటి వరకు తమకు బలమైన క్యాడర్ ఉందని, గ్రామాల్లో తమకే ప్రజాదరణ ఉందని చెప్పుకుంటున్న నాయకులకు స్థానిక ఎన్నికలు ఒక రకంగా 'అగ్నిపరీక్ష' కానున్నాయి. సమావేశాలు, ప్రకటనలు, అనుచరుల సంఖ్య కంటే పోలింగ్ రోజు ఓటర్ల మద్దతు ఎంత లభిస్తుందన్నదే అసలు బలాన్ని నిర్ధారించనుంది.

**ఫలితాలే అసలు కొలమానం**

పెనగలూరు మండలంలోని ప్రతి గ్రామంలో స్థానిక పరిస్థితులు, అభ్యర్థుల వ్యక్తిగత బలం, సామాజిక సమీకరణాలు, పార్టీ క్యాడర్ పనితీరు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం అభ్యర్థుల గెలుపోటములకే పరిమితం కాకుండా.. భవిష్యత్ మండల రాజకీయాల్లో ఎవరి మాటకు ఎంత విలువ ఉందో నిర్ణయించే వేదికగా మారనున్నాయి.

# భూ సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళిక

**అధికారుల సమన్వయంతోనే పనుల్లో వేగం – అభివృద్ధి ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి**

**సమీక్షలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశం**



మనం ప్రతినిధి ?మదనపల్లె అక్టోబర్ 5: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం, ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వ అభివృద్ధి పనుల వేగవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీసీ హాలులో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి జిల్లా స్థాయి, డివిజనల్ అధికారులతో కలెక్టర్ విస్తృత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం సమస్యల తీవ్రతను వివరించడమే కాకుండా, వాటి పరిష్కారానికి రెండు, మూడు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

**రికార్డుల నవీకరణ, భూసేకరణపై ప్రత్యేక దృష్టి**

రెవెన్యూ రికార్డుల నవీకరణ, రీసర్వే, 22-ఏ భూముల సమస్యలు, డాటెడ్ ల్యాండ్స్, ఆర్ఓఆర్ వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి, కొత్త పెట్టుబడుల ప్రోత్సాహానికి అనువైన 500 ఎకరాల భూమి గుర్తింపు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఎంఎస్ఎంఈ పార్కులు, ఎస్టీపీలు, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణానికి భూముల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలు, రిజర్వాయర్ల భూసేకరణ, రైతులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

**రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు**

రాబోయే రెండు నెలల్లో మార్కెట్లోకి రానున్న పంటలు, ధరల హెచ్చుతగ్గులను ముందుగానే అంచనా వేసి రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్, ఖరీఫ్ పంటల ప్రణాళిక, మామిడి మార్కెటింగ్‌పై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వీటితో పాటు జలధార పనులు, జూ= నిధుల వినియోగం, హార్స్లీహిల్స్ పర్యాటక అభివృద్ధి, స్వచ్ఛ సర్వేక్షణ్ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో ఏ.వెంకటేష్, ఆర్డీవోలు శ్రీనివాస్, విజయలక్ష్మితో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఎంఈఓ-ఓపీ పథకం కింద ఆయిల్ పామ్ సాగువిస్తరణపై ఉద్యాన రైతులకు అవగాహన సమావేశం




రైల్వే కోడూరు, అక్టోబర్ 05, మనం న్యూస్: తిరుపతి జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైల్వే కోడూరు మండలం అబ్బినాయుడు పల్లి గ్రామంలో జాతీయ తినదగిన నూనెల మిషన్ -- ఆయిల్ పామ్ పథకం కింద ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ఉద్యాన రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి జయ భరత్ రెడ్డి తిరుపతి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం మామిడి సాగులో ఎదురవుతున్న వాతావరణ మార్పులు, ధరల హెచ్చుతగ్గులు వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ వాణిజ్య పంటగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రైల్వే కోడూరు ఉద్యాన ఉద్యాన పరిశోధన స్థానం, అనంతరాజుపేట శాస్త్రవేత్త డా. తనుజ ఆయిల్ పామ్ సాగులో భూమి ఎంపిక, గుంతల తయారీ, నాటే దూరం, నాణ్యమైన మొక్కల ఎంపిక, నీటి యాజమాన్యం, ఎరువుల నిర్వహణ, అంతర పంటల సాగు, పురుగు-వ్యాధుల నియంత్రణ, అధిక దిగుబడులు సాధించే ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు సమగ్రంగా వివరించారు. డా. యోహన్, శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం, అనంతరాజుపేట వారు ఎల్ నినో ప్రభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి ఉద్యాన పంటలలో అవలంబించాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. రైల్వే కోడూరు ఉద్యాన అధికారి ఎం. వెంకట భాస్కర్ ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి రైతులకు వివరించారు. ప్రభుత్వం గుర్తించిన మండలాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టిన రైతులకు క్రింది ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎకరానికి సుమారు రూ.10,000 విలువైన ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా అందజేస్తారు.

మొదటి నాలుగు సంవత్సరాల పాటు సాగు నిర్వహణ ఖర్చుల కోసం ఎకరానికి సంవత్సరానికి రూ.2,100 ఆర్థిక సహాయం అందజేస్తారు. అంతర పంటల సాగును ప్రోత్సహించేందుకు ఎకరానికి సంవత్సరానికి రూ.2,100 చొప్పున ప్రోత్సాహకం అందజేస్తారు. ఆయిల్ పామ్ తోటలలో బిందు సేద్య (డ్రిప్ ఇరిగేషన్) పరికరాలకు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సేద్య పథకం ద్వారా రాయితీ కల్పిస్తారు. ఆయిల్ పామ్ తాజా గెలల ధరలను ప్రతి నెల ప్రభుత్వం నిర్ణయించడం వల్ల దళారీల ప్రమేయం లేకుండా రైతులకు పారదర్శకమైన ధరలు లభిస్తాయి అని వివరించారు. అనంతరం సువెన్ అగ్రో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, సంస్థ రైతులకు నాణ్యమైన మొక్కల సరఫరా, సాంకేతిక మార్గదర్శకత్వం, పంట నిర్వహణలో సహాయం మరియు రైతులు ఉత్పత్తి చేసిన తాజా గెలలను కొనుగోలు చేసే విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సువెన్ అగ్రో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ కొండారెడ్డి, ఉద్యానశాఖ గ్రామ ఉద్యాన సహాయకులు ఉదయభాను, శ్రావణ కీర్తి, దినేష్ మరియు ఉద్యాన రైతులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటన గ్రాండ్ సక్సెస్

ప్రొద్దుటూరు అక్టోబర్ 5 మనంన్యూస్:

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు పర్యటన గ్రాండ్ సక్సెస్ కావడానికి సహకరించిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకి, DIG కోయ ప్రవీణ్‌కి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి, జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కి కృతజ్ఞతలు తెలియజేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి యువనాయకులు నంద్యాల కొండారెడ్డి



# రాయలసీమ రైజింగ్ సభకు తరలివెళ్లిన రాంనగర్ తెలుగు తమ్ముళ్లు






రాజంపేట: అక్టోబర్:5 (మనం న్యూస్ ): పొద్దుటూరులో సోమవారం నిర్వహించిన 'రాయలసీమ రైజింగ్' మహాసభకు రాజంపేట మున్సిపాలిటీ రాంనగర్ 6, 7 వార్డుల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లడం జరిగిందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్ అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆదేశాల మేరకు 48 మంది కార్యకర్తలు బస్సులో సభకు బయలుదేరారు. మాజీ పట్టణ అధ్యక్షుడు టి.సంజీవ రావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాంనగర్ నరసింహ, వార్డు అధ్యక్షులు బర్నేల నాగేంద్ర, కంచన సుధాకర్, కొరముట్ల చిన్న, కోడూరి వేణు గోపాల్, ప్రభాకర్‌గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. రాంనగర్ నుంచి బయలుదేరిన బస్సును టీడీపీ పార్లమెంటు అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్, పట్టణ అధ్యక్షుడు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్ర మౌళి, క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్.కె.కరీం, పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, క్లస్టర్-2 ఇన్‌చార్జి కొల్లి రెడ్డయ్య పాల్గొన్నారు.

## మండల సమస్యలు పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కలిసిన మాజీ జడ్పీటీసీ



ఒంటిమిట్ట, అక్టోబరు 5 మనం న్యూస్ : జల జీవన్ మిషన్-అమరజీవి జలధార కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు కు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఒంటిమిట్ట మండల మాజీ జడ్పీటీసీ అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి సోమవారం ప్రొద్దుటూరు హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ఆదేశాల మేరకు సీఎంను కలిసి మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

కుడుములూరు తదితర గ్రామాల్లో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఆర్డీవో అనుమతి పొందిన 12.26 సెంట్ల భూమిలో అర్హులకు త్వరగా పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కుడుములూరు రహదారితో పాటు మండలంలోని ఇతర రోడ్ల సమస్యలు, తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు.

ఒంటిమిట్ట, సిద్ధవటం ప్రాంతాల్లో ఏడో విడతలో పేదలకు కేటాయించిన భూములకు సంబంధించిన సమస్యలను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ముద్దుకృష్ణారెడ్డి తెలిపారు.

## ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు.. పిచ్చి మొక్కలు




చిట్వేలి అక్టోబర్ 5 మనం న్యూస్: మండల వ్యాప్తంగా గ్రామాలకు వెళ్లే రహదారి కి ఇరువైపులా గత కొద్ది రోజుల క్రితం అప్పుడప్పుడు వర్షాలు పడడంతో చెట్లు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. ఈ సందర్భంగా.. చిట్వేలీ నుండి రాపూర్‌కి వెళ్లే రహదారి, చిట్వేల్ నుండి రైల్వేకోడూరుకి వెళ్లే దారి, చిట్వేలీ నుండి రాజంపేటకు వెళ్లేదారి, చిట్వేలీ నుండి మగంపేటకు వెళ్లే దారి, చిట్వేలీ నుండి పుల్లంపేటకు వెళ్ళే దారి, అలాగే మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా కంప చెట్లు, పిచ్చి మొక్కలు, పెరిగిపో వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను, పిచ్చి మొక్కలను, తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరారు. మరి ముఖ్యంగా మండలంలోని భాకరాపురం కొత్తపల్లి నుండి ఎం.రాచపల్లి కి వెళ్లే మార్గం మధ్యలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు అర్థ రోడ్డు ఆక్రమించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నారని, ఆ గ్రామానికి వెళ్లాలంటే ప్రమాదాలకు నిలయంగా రహదారికి ఇరువైపులా చెట్లు పెరిగిపోయాయని, ప్రమాదాలను అరికట్టాలంటే వెంటనే సంబంధిత స్పందించి కంప చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# వైభవంగా 'అమరజీవి జలధార' ప్రారంభోత్సవం




రైల్వే కోడూరు, అక్టోబర్ 05, మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30,000 కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జల్ జీవన్ మిషన్ -- "అమరజీవి జలధార" కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి గ్రామానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లకు హెలిప్యాడ్ వద్ద ఘన

### సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ఘన స్వాగతం

స్వాగతం లభించింది. రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మరియు 'కుడా'చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, రైల్వే కోడూరు నియోజకవర్గ శాసనసభ్యులు అరవ శ్రీధర్, తదితరులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు పూలమాలలు, దుశ్శాలువాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం, నాయకులు అందరూ కలిసి సీఎం, డిప్యూటీ సీఎం గార్లతో పాటు సభ వేదికకు చేరుకుని 'అమరజీవి జలధార' బహిరంగ సభలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి ఎద్దడిని నివారించి, ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకం ప్రారంభించడం పట్ల నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



## శ్రీ శాంతినికేతన్ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా శ్రీదేవి

పుల్లంపేట అక్టోబర్ 5 (మనం న్యూస్) తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలంలోని శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా (ఞఞాఖూహీూ)ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిన్నటి రోజున జరిగిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రైవేట్ స్కూల్లో పని చేసే ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి మెమెంటోస్ ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మా శాంతినికేతన్ స్కూల్ ఉపాధ్యాయురాలు చీ. శ్రీదేవి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆ పులివర్తినేని మురళీమోహన్ ,ఙణ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి ,ఙ.జు.ా కుమార్ రాష్ట్ర గ్రీనింగ్ ఌ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, అపుస్మ తిరుపతి జిల్లా అధ్యక్షులు విశ్వం స్కూల్ అధినేత విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు సెల్ ఫోన్ నుండి దూరం చేసే బాధ్యత టీచర్స్ దే అని చెప్పారు. జంక్ ఫుడ్ తినకుండా చూడాలి , అని ఉపాధ్యాయులకు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మా సంస్థ కరస్పాండెంట్ అవ్వారు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక చేయడం పట్ల స్కూల్ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

## కడప జడ్పీ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

**సీఎం చంద్రబాబును కోరిన మేడా విజయ శేఖర్ రెడ్డి**




మనం న్యూస్ రాజంపేట, అక్టోబర్ 5: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన 'జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార' కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాజంపేట టీడీపీ సీనియర్ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతూ, కడప జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు తాను నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నానని గుర్తుచేస్తూ, జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని చంద్ర బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## కాణిపాకంలో 8 లక్షల 5వేలు పలికిన గణపయ్య లడ్డు

కాణిపాకం మనం న్యూస్; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2026 వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామివారి 21 రోజుల, 21 కేజీల మహా లడ్డు ప్రసాదం ఆదివారం రాత్రి తెప్పోత్సవం అనంతరం పుష్కరణి నందు సుభద మండపంలో బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది. ఈ వేలం నందు నెల్లూరుకు చెందిన శ్రీ సారంగం ప్రసాద్ , 8,05,000/-రూపాయలతో శ్రీ స్వామివారి మహాప్రసాదం లడ్డుని దక్కించుకున్నారు, వీరు నెల్లూరు నుంచి పాదయాత్రలో కాణిపాకం వచ్చి స్వామివారి లడ్డును దక్కించుకున్నారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, మరియు ఈవో పెంచల కిషోర్ , ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

